# మా రాముడి గోల

పుట్టా వెంకటసుబ్బారావు.

"ఆడవాళ్ళమై పుడితే బాగుండునురా!" అన్నాడు రాముడు.

"ఈరోజుల్లో ఆడవాళ్ళయి పుడితే ఏమి లాభమురా? ఆడవాళ్ళంటే అందరకు లోకువే! నవ్వులరాణీలో కథలు వ్రాసే కుఱ్ఱాళ్ళకు సహితం—శ్రీ చలంగారన్నట్లు 'స్త్రీలు కనడం తినడం' స్థితిలోకి వచ్చారు. మనపురాణాల ప్రకారం స్త్రీకి స్వాతంత్ర్యము లేదు. చిన్నతనములో తల్లిదండ్రులు చెప్పినట్లు వినాలి. యౌవ్వనములో భర్త చెప్పినట్లు చెయ్యాలి. వృద్ధాప్యములో కుమారుడు చెప్పినట్లు నడచుకోవాలి. ఏకష్టమైనా భరింపవచ్చును గాని అస్వాతంత్రత మాత్రము కష్టము. కడుపునిండా అన్నము లేకుండా వుండవచ్చును—కాలికొలది తిరగకుండా వుండలేము. పంజరములో చిలుక ఎన్నివిధాల పోషించినా ఎందుకు అట్లా కృశిస్తుంది? స్వేచ్ఛ లేక.

ఆడవాళ్ళయితే, తెరలు కట్టుకొని యింట్లో కూర్చోవాలి. అది మనకు చేతగాని పని. నీవు ఆడదానివై నీతో నేను మాట్లాడుతుంటే యికనేమైనా వుందా! ప్రజలలో ఎన్ని గుసగుసలైనా బయలుదేరుతాయి. ఆ మొగవాడిని తమ్ముడనుకున్నా—అన్న అనుకున్నా—మరియే పవిత్రమైన వుద్దేశము లోపలవున్నా వాళ్ళ కవసరము లేదు. ఆడవాళ్ళయితే సంవత్సరానికిద్దరు పిల్లలు పుడితే యిప్పటికి పదిమంది పిల్లలౌదురు. ఆపిల్లలతో సంసారముతో, కుళ్ళి కుంగి, కృశించి చావటానికి సిద్ధమై కాటికి కాళ్ళుచాచి కూర్చుందుము. కర్మముకాలి, పెళ్ళిఅయిన తరువాత భర్త పోతే, ముండనమండితంబగు గుండుగల యండజయాన క్రింద తయారుచేసి, ధవళవస్త్ర కిరీటధారిని చేసి వంటయింటి సామ్రాజ్యాధిపత్యము యిద్దురు. అర్ధాంగిలక్ష్మి యనియే మొగవాడైనా కొంచెము ఆదరించెనా, వానిని పెళ్ళము చెప్పినమాట వింటాడని హేళనచేస్తారు అంతేగాని 'కార్యేషు మంత్రి' అందుచే వింటున్నాడనరు. ఏవిషయములో ఆడవాళ్ళయితే బాగుంటుందని అన్నావు." అన్నాను నేను.

"చెప్పేదంతా వినకుండా గిరీశం లెక్చరు మొదలు పెడితే నేనేమి చెప్పను? ప్రతిరోజూ గడ్డము చేసుకోవటము కష్టముగా వుంది. ఆడవాళ్ళయితే, ఆ అవస్థ తప్పునన్న వూహతో ఆ మాట అన్నాను."

"మీసం గడ్డం ఎవరు తీసివేయమన్నారు. మీసం గడ్డమువుంటే రోషమన్న మాట."

"మీసం గడ్డంవుంటే దోషమని తమ్ముడి మాట."

"మీసం గడ్డంవుండే సింహములాగుంటారు మొగాళ్ళు".

"మీసం గడ్డంవుంటే చింబోతు లాగుంటారు మొగాళ్ళు".

"గడ్డం పెంచుకుంటే సైను సేవవుతుంది. అందుకనే పూర్వము ఋషులంతా గడ్డము పెంచుకొని భగవంతుని ప్రార్థించేవారు".

"గడ్డము కొంచెము పెరగడముతోటే 'నీ భార్యగర్భిణీతో వుందా? అది మంగలివాడికి ముకుపు చెల్లించు బాబూ! మంగలివాడికి డబ్బు మేమైనా యిచ్చుకొంటాము. నిన్నుచూస్తే ఎలుగుగొడ్డు జ్ఞాపకమొస్తుంది. మాకు భయమే

స్తుంది. అని ఏడిపిస్తారంతా—వాళ్ళకోటికి భయపడి గడ్డంతీసి వేస్తున్నాను".

"ఎవ్వరైనా ఏమైనా అంటే ఊరుకోవటం ఎందుకు? వాళ్ళమాటలకు లెక్క చెయ్యకుండా ఏడిపించినప్పుడు ఏడవకుండా వుంటే ఏడ్పించదలచుకొన్నవాళ్లే ఏడుస్తారు".

"ఎవరైనా ఏదైనా అంటే లెక్క చెయ్యకుండా వుంటానికి రాతిమనిషి ననుకున్నావా? నాకు హృదయం లేదనుకున్నావా? రక్తము నా శరీరములో ప్రవేశించటము లేదనుకున్నావా?"

"గడ్డము చేసుకోలేక ఆడవాళ్ళయి పుట్టాలనివుంది నీకు—ఆడవాళ్ళకు కొందరికి గడ్డాలు వస్తాయి తెలుసా! అలా వస్తే నక్కచావవుతుంది".

"ఇది చలికాలం—ఏదో పనితొందర వుంటుంది—పొద్దున్నే ఏమంగలివాడు చలిలో బయలుదేరడు. అయ్యవచ్చేవరకు అమావాస్య అగదని మనము చేసుకోవటము మొదలుపెట్టుతాము. వణుకుతూ చేసుకోవటములో గడ్డము తెగి నెత్తురు కళ్ళబడుతుంది".

"ఈఅవస్థలన్నీ ఎందుకని గడ్డంపెంచుకోమన్నాను. పూర్వము కామి ఫ్రాన్సురాజును పెండ్లిచేసుకుంది. పెండ్లికొడుకు మీసములు గడ్డములు గొరిగించుకొని కనబడేసరికి నీ మొఖము నా మొఖమువలె వుంది అని ఆయనను డైవర్సు చేసింది. తరువాత ఇంగ్లండురాజగు రెండవహెన్రీని పెండ్లిచేసుకుంది. చూచావా! గడ్డం మీసంలేకపోతే ఎంత హీనముగా చూస్తారో!"

"మనకి మీసాలున్నాయిగా?"

"గడ్డాలు తీసివేస్తే మీసాలుకొంతవరకు తీసివేసినట్లే! గడ్డాలు మీసాలలో ఒకభాగం. పెద్ద మీసాలు పెంచుకొని, మీసాలపోతని కైటేలు పుచ్చుకుందామన్న వాళ్లు గెడ్డములో కొన్ని వెంట్రుకలు మీసాలలో కలుపుతారు. పూర్వం మీసాలు పెంచి సంపెంగనూనెరాసి రెండువైపుల తుమ్మెదరెక్కలవలెనున్న ఆపట్టుడేసి మీసాలు రెండు చేతులతోను వడివేసి మైనమురాసి గొట్టకొమ్ములవలె నిలబెట్టేవారట. ఈతెల్లవాళ్లొచ్చాక మీసాలు గొరుక్కోవటము, గెడ్డాలు గొరుకోటము వచ్చింది. దేవుడు పిచ్చివాడై యిచ్చాడా? యీగెడ్డం—ఈమీసం—గడ్డము పెంచుకొంటే చలికాలములో చలివెయ్యదు. ఎండాకాలములో మొఖానికి ఎండ తగలదు."

"మనకు తురకలకు వ్యతిరేకం—అందుకని వాళ్లు పెంచుకుంటే మనము వుంచుకోకుండా తీసి వెయ్యాలి".

"దేశనాయకులంతా హిందూ మహమ్మదీయ సఖ్యతకోసం పాటుపడుతున్నారు. అది కలగాలంటే గడ్డము పెంచుకోవాలి."

"ఏపటములో చూచినా భగవంతులకు గడ్డమువున్నట్లు కన్పించదు. వారు ఏమిచేస్తారో?"

"పరమేశ్వరుడు హాలాహాలం త్రాగినప్పుడు కొంచెము గడ్డముమీద పడిందట పడిదానం తాకాల్చివేసిందట. ఆడడై పుట్టినప్పటినుండి విష్ణుమూర్తికి గడ్డమురావటము మానివేసిందట, అందరకు ఒకమొఖముంటే బ్రహ్మకు నాలుగుమొఖాలున్నాయి. నాలుగు గడ్డాలతో తిప్పలుపడలేక సృష్టించుకోవటము మానివేశాడు. ఇంద్రుడు నరకాసురుడితో ఓడిపోయినప్పుడు ఒకరాక్షసుడు గడ్డము వూడదీసి వేసాడట."

"ఏది ఎలాగున్నా నలుగురు చేస్తున్నపని చెయ్యాలి. నలుగురితోపాటు నారాయణ కులముతోపాటు గోవిందఅన్నారు."

"నలుగురు చేస్తున్నారని మనముచేస్తే గొర్రెలలో లెక్కవేయబడతాము మంచిచెడ్డలు తెలియకుండా ఒకగొర్రెవెనుక ఒకటి వెళ్ళుతు ది మొదటిది వెళ్ళి గోతిలోపడ్డాక తక్కినవన్నీ గోతిలో పడతాయి. మీసాలుంటే పౌరుషము సూచిస్తాయి. 'రోషములేని మీసము' అన్నాడు. గడ్డముపుంటేకూడా అంతే రంజిత్ సింగును Lion of Lahore పంజాబుసింహమన్నారు. ఎందుచేత! గెడ్డము మీసములువుంచుకోబట్టే! మీసాలు గెడ్డాలు వుంచుకొంటూరుగనుకనే, శిక్కులు పౌరుషవంతులైనారు. మనకీ యీడంగి అలహా ఎక్కడనుంచి వచ్చినదో తెలియకుండావుంది ఆంగ్లకవియగు షేక్స్పియరుకు గడముండి. బేకనుకుండి స్పెన్సర్కువుంది. స్పెయిన్ రాజుకు చక్కని గడ్డాలుండేవి, మొన్నపోయిన మనరాజుగారికి గడ్డముండేది ఆశియాఖండమందు గొప్ప కవీశ్వరుడగు రవీంధ్రినాధటాగురుకు గడ్డముంది. సురేంద్రినాదబెనర్జీకి గెడ్డంవుంది. వీరందరికంటే గొప్పవారవుదామనా? మనము మీసాలుగెడ్డాలు తీసివెయ్యటము"

"ఇక లెచ్చరు కట్టిపెట్టు రేపటినుంచి మీసాలు గెడ్డాలు యిన్సిష్టింగ్ ఎసోసియేషనుగా తయారవుదాము. నీవు దానికి ప్రెసిడెంటుగా వుండుగాని దాడీలు పెంచి మనమంతా మందరికి బోధచేద్దాము. యివాళ్ళకు Good bye" అన్నాడు రాముడు.

నేనుకూడా, "Good bye" అన్నాను.

---

# ప్రేమాహుతి

కె. ఎస్. ప్రకాశరావు.

ఆనాడు షెర్లీటెంపిల్ ఫిలిం. నేనూబయలుదేరేను సినిమాకి. నేనువెళ్లేటప్పటికి ఆటప్రారంభమయింది. ఇంటరవల్ కాస్సేపటికయింది. నాముందర వరుసలో కొంతమంది అమ్మాయిలు కూర్చున్నారు. కాలేజీగరల్సులాగే కనిపించారు వాళ్లలో ఒకమ్మాయి, బుజాలవరకూ వేళ్లాడేలోలకులు, చేతికి వాచీ, కాళ్లకి జోడూ, కరాచీశిల్కు చీరెకట్టుకొని నేనెప్పుడో చూచిన అమ్మాయిలాగే కనపించింది. కాని యెవరో నాకు జ్ఞాపకం రాలేదు. యింతలో ఒకబిళ్లబంట్రోతు వచ్చేడు. 'రామస్వామీ నాలుగు డ్రింకులు తీసికొనిరా' అంది. దీనినిబట్టి ఒకఆఫీసరు కూతురైవుంటుందని అనుకున్నా. మరికాస్సేపటికి ఆటకూడా అయిపోయింది. నేనుబయటకు వెళ్తున్నా, 'మోహన్! ఎప్పుడువచ్చేవు?' అనేకేక వెనుకనుంచి వినిపించింది. వెనక్కి చూచేటప్పటికి యిందాకటి అమ్మాయే నేను అప్రయత్నంగా 'ఈవేళేవచ్చే' నని అనేశాను. 'రేపు మాయింటికి వస్తావుకాదూ' అంటూ వెళ్ళిపోయింది తనతో వచ్చిన అమ్మాయిలతో.